## నేడే బీఆర్ఎస్ 25 ఏళ్ల పండుగ



పద్నాలుగేళ్లు ఉద్యమపార్టీగా.. పదేళ్లు అధికార పార్టీగా.. పదహారు నెలలుగా ప్రతిపక్షపార్టీగా.. ప్రజలు ఏ బాధ్యత ఇస్తే ఆ బాధ్యతను అద్భుతంగా నిర్వహిస్తూ తెలంగాణ గొంతుకగా నిలిచిన భారత రాష్ట్ర సమితి, ఇప్పుడు 25 వసంతంలోకి అడుగు పెట్టబోతున్నది. 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించిన బీఆర్ఎస్, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే ఎజెండాగా కదిలి, సమైక్య సంకెళ్లు తెచ్చి రాష్ట్రాన్ని సాధించి, పదేళ్లలో తెలంగాణను అన్నింటా అగ్రగామిగా నిలిపింది. అధికారంలో ఉన్నా.. లేకున్నా తెలంగాణ ప్రజల తోడు నీడగా నిలిచింది. నేడు ఎల్కతుర్తి వేదికగా రజతోత్సవ వేడుకకు సిద్ధం కాగా, స్వచ్ఛందంగా కదిలేందుకు ఉమ్మడిగడ్డ సిద్ధమైంది.



ఎల్కతుర్తిలో సిద్ధమైన రజతోత్సవ సభా వేదిక

# చలో వరంగల్

## దారులన్నీ ఎల్కతుర్తి రజతోత్సవ సభకే!

- ఉమ్మడి జిల్లా నుంచి కదలనున్న దండు
- స్వచ్ఛందంగా తరలేందుకు ఉత్సాహం చూపుతున్న శ్రేణులు, ప్రజలు
- 2 లక్షల మంది వెళ్లేందుకు ఏర్పాట్లు
- పల్లెపల్లెనా జెండా ఎత్తి సభకు పయనం
- ఉదయం 10 గంటల నుంచే పరుగులు తీయనున్న వాహనాలు
- గులాబీమయం కానున్న రహదారులు
- ఏర్పాట్లు చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జిలు



గుండెల నిండా గులాబీ జెండాను నింపుకొన్న ఉమ్మడి జిల్లా ప్రజానీకం, బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలేందుకు సమాయత్తమైంది. ఆదివారం 'చలో వరంగల్' అంటూ ఎల్కతుర్తికి కదం తొక్కేందుకు సిద్ధమైంది. ఉదయం గ్రామగ్రామాన గులాబీ జెండాలు ఎగురవేసి ఆ తర్వాత ఎల్కతుర్తి సభకు కదలనున్నది. మరికొద్ది గంటల్లోనే ప్రజలు, పార్టీ శ్రేణులు ఆయా పట్టణాలు, పల్లెల నుంచి స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సభకు వెళ్లే వారికి భోజన, మంచి నీటి వసతి కల్పించేందుకు పార్టీ పరంగా ఏర్పాట్లు చేసినా, ఎక్కడికక్కడే స్వచ్ఛందంగా సమకూర్చుకున్నారు. ఎండతో ఏ మాత్రం సంబంధం లేకుండా, రజతోత్సవ సభను విజయవంతం చేయాలన్న లక్ష్యంతో పకడ్బందీ ప్రణాళికలు చేశారు. ఇదిలా ఉంటే ఆయా నియోజకవర్గాల్లో వారం పది రోజులుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రత్యేక దృష్టిసారించి, ప్రజలను చైతన్యవంతం చేయడంలో సక్సెస్ అయ్యారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి రెండులక్షల మందికిపైగా హాజరయ్యే అంచనాలు కనిపిస్తున్నాయి. జన స్పందనచూస్తే అంతకుమించి వచ్చే అవకాశాలున్నాయి.

కరీంనగర్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివెళ్లేందుకు సర్వం సిద్ధమైంది. వారంరోజులుగా పల్లె, పట్నం అన్న తేడా లేకుండా గులాబీ గుబాళింపు కనిపిస్తున్నది. సభకు భారీగా తరలి రావాలంటూ కేసీఆర్, కేటీఆర్ పిలుపునివ్వడం, మరోవైపు కాంగ్రెస్ వైఫల్యాలపై విసుగుచెందిన ప్రజలు తమదైన శైలిలో కేసీఆర్‌కు మద్దతు ఇవ్వాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నట్టు కనిపిస్తున్నది. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలోని ప్రతి పల్లెలో జెండా ఎగురవేసేందుకు సిద్ధమయ్యారు. గద్దెలకు గులాబీ రంగు వేశారు. 'జై తెలంగాణ' నినాదాలు రాశారు. సభకు బయలు దేరే ముందే జెండాను ఎగురవేయాలని నిర్ణయించుకున్న నాయకులు, ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఈ కార్యక్రమం పూర్తి చేసేందుకు ప్లాన్ చేసుకున్నారు. సభకు వెళ్లేందుకుగాను ఆయా గ్రామాల్లోనే ముందస్తుగా వంటలు వండుకొని, వాటిని సదరు వాహనాల్లో పెట్టుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మంచినీరు, మజ్జిగ ప్యాకెట్ల వంటివి సమకూర్చుకొని ఎక్కడా ఇబ్బందులు రాకుండా పార్టీ నాయకత్వం చర్యలు తీసుకోగా, దారి పొడవునా గులాబీ జెండాలను రెపరెపలాడించడమే లక్ష్యంగా ప్రతి వాహనంలో జెండాలు తీసుకెళ్తున్నారు.



### రెండు లక్షలకుపైగా..

రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు రెండు లక్షల పైచిలుకు ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివెళ్తున్నారు. కరీంనగర్ జిల్లా నుంచి లక్షాయాభై వేలు కాగా, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి 20 నుంచి 25వేల వేలమంది చొప్పున తరలివెళ్లేలా పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం ఉన్న స్పందన చూస్తే అంతకు మించి జనం వెళ్లినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తున్నది. తెలంగాణ సాధన కోసం ఆనాడు సబ్బండ వర్గాలు పోరుబాట పట్టినట్టు, ఈసారి రజతోత్సవ సభకు కదులుతున్న పరిస్థితి ఉంది. ఎలాగైనా సరే వరంగల్ సభకు వెళ్లి కేసీఆర్‌కు మద్దతు పలుకాలన్న లక్ష్యం మెజార్టీ వర్గాల్లో కనిపిస్తున్నది. ఆదివారం కావడంతో ఉద్యోగ, కార్మిక సంఘాలు సైతం పెద్ద సంఖ్యలో తరలివెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నట్లుగా తెలుస్తున్నది. అలాగే ఈసారి యువతలో సభకు వెళ్లేందుకు ఎక్కువ ఉత్సాహం కనిపిస్తున్నది. మెజార్టీ గ్రామాల్లో యువతే సారథ్యం వహించి ఆయా గ్రామాల ప్రజలను సభకు తీసుకెళ్తున్నారు. ప్రజల స్పందన చూస్తే ప్రస్తుతం పార్టీ పరంగా ఏర్పాటు చేసిన వాహనాలు సరిపోవడం లేదని, అందుకే ఎవరికి వారే స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకొని వస్తున్న తీరు కేసీఆర్‌పై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

### మరోసారి సత్తా

గులాబీ జెండాకు ఉమ్మడి జిల్లా ఆది నుంచీ అండగా నిలుస్తూ వచ్చింది. పార్టీ ఆవిర్భావం నుంచి మొదలు నేటి రజతోత్సవ సభ వరకు ముందుండి సంఘీభావాన్ని ప్రకటిస్తూనే ఉన్నది. అదే అభిమానంతో రజతోత్సవ సభకు మరోసారి సత్తా చాటుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి గులాబీ జెండా కష్టకాలంలో ఉన్న ప్రతిసారి ఈ ప్రాంత ప్రజలు అండగా నిలిచారు. కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకొని ఆకాశానికి ఎత్తుకుంటూ వచ్చారు. తెలంగాణ సాధనే లక్ష్యంగా 2001 మే 17న జరిగిన సింహగర్జన సభకు అండగా నిలిచిన ఉమ్మడి జిల్లా ప్రజలు, తర్వాత కూడా తామున్నామనే ధైర్యాన్నిచ్చారు. 2006లో తెలంగాణ వాదమే లేదంటూ హేళన చేసే సమయంలో ఎంపీ పదవిని తృణ ప్రాయంగా వదులుకున్న కేసీఆర్, తిరిగి పోటీచేస్తే రెండు లక్షల మెజార్టీతో గెలిపించి ప్రత్యేక తెలంగాణ నినాదం ఉందని ప్రపంచానికి చాటి చెప్పారు. అంతేకాదు, పలుసార్లు వచ్చిన ఉప ఎన్నికలతోపాటు సాధారణ ఎన్నికలు, ఆమరణ నిరాహార దీక్ష వంటి అనేక అంశాల్లో కేసీఆర్‌కు ఉమ్మడి జిల్లా అండగా నిలిచింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే ఈసారి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాతినిధ్యం రజతోత్సవ సభలోనూ ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తున్నది.

### అడ్డంకులు సృష్టించే ప్రయత్నం

సభకు ఉవ్వెత్తున తరలిపోయేందుకు ప్రజలు, పార్టీ శ్రేణులు ఉత్సాహం చూపుతున్న నేపథ్యంలో జనజాతరకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం పరోక్ష పద్ధతుల్లో కుట్రలకు తెరలేపిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా సభకు ప్రజలను తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ బస్సులకు సవాలక్ష నిబంధనలు పెడుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. స్కూల్ బస్సుల విషయంలోనూ అదే పంథాను ప్రభుత్వం అనుసరిస్తున్నట్టు తెలుస్తున్నది. అలాగే సభకు వెళ్లకుండా మధ్యమధ్యలో ట్రాఫిక్ బూచి చూపి, ఎక్కడికక్కడే వాహనాలను నిలుపుచేసే అవకాశాలు ఉన్నాయని అత్యంత విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తున్నది. దీంతో పాటు ఇప్పటికే పలు ప్రైవేట్ వాహనాలకు ఫోన్‌చేసి, సభకు వెళ్తే చర్యలు ఉంటాయన్న సంకేతాలను కొంత మంది అధికారుల ద్వారా ఇప్పిస్తున్నట్టు సమాచారం. కానీ, ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభకు వెళ్లి తీరుతామనే పట్టుదల అడుగడుగునా కనిపిస్తున్నది.



నగరంలో కోతిరాంపూర్‌లోని గాంధీ విగ్రహం వద్ద కేసీఆర్ చిత్రపటానికి దిష్టితీసి గుమ్మడికాయ కొడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

## దిష్టి తీసి.. గుమ్మడి కాయ కొట్టి

- కేసీఆర్ కటౌట్‌కు దిష్టి తీసిన బీఆర్ఎస్ శ్రేణులు

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 : ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు రానున్న పార్టీ అధినేత కేసీఆర్‌కు దిష్టి తొలగాలని కోరుకుంటూ కరీంనగర్‌లోని కోతిరాంపూర్ చౌరస్తాలో కేసీఆర్ కటౌట్‌కు పార్టీ మహిళా నాయకులు దిష్టి తీసి, గుమ్మడికాయ కొట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ పోరాటం నుంచి ఇప్పటివరకు కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, ఆయన ఓడిపోవాలని, అధికారంలోకి రావద్దంటూ ఎందరో దిష్టి పెడుతున్నారని చెప్పారు. ఆయనకు ఎలాంటి దిష్టి తగలకుండా నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి, ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవాలని ఆకాంక్షించారు. దేశం మొత్తం ఆదివారం జరగనున్న రజతోత్సవ సభ వైపు చూస్తున్నదని చెప్పారు. సభకు బీఆర్ఎస్ శ్రేణులతోపాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు ఐలేందర్ యాదవ్, శ్రీకాంత్ నాయకులు గంధ మహేశ్, కర్ర సూర్యశేఖర్, కలర్ సత్తన్న పాల్గొన్నారు.






## కేసీఆర్ గొప్ప నిర్దేశకుడు

- తెలంగాణ వస్తుందని విశ్వసించిన మొదటి వ్యక్తి ఆయనే..
- జలదృశ్యంలో పార్టీ ఆవిష్కరించినప్పుడు ఉన్న కొద్ది మందిలో నేను ఒకడిని
- 'నమస్తే'తో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు

కరీంనగర్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వస్తుందని విశ్వసించిన మొదటి వ్యక్తి కేసీఆరేనని, ఆయన గొప్ప మార్గనిర్దేశకుడని తొలితరం ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు అభివర్ణించారు. తాము ఉద్యమమే స్ఫూర్తిగా బతికామని, జలదృశ్యంలో పార్టీ ఆవిష్కరించినప్పుడు ఉన్న కొద్ది మందిలో తాను ఒకడిగా ఉన్నానని గుర్తు చేశారు. పార్టీ స్థాపించిన 24 ఏండ్లలో ఎన్నో ఎదురు దెబ్బలు, అవమానాలను ఎదుర్కొన్నామని, అయినా పార్టీ మాత్రం ఏ మాత్రం చెక్కు చెదర లేకపోగా రోజు రోజుకూ మరింత బలపడిందని యాది చేసుకున్నారు. ఆనాటి తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుత బీఆర్ఎస్)ని స్థాపించి 24 వసంతాలు పూర్తయి 25వ ఏట అడుగిడుతున్న నేపథ్యంలో ఎల్కతుర్తిలో రజతోత్సవ సభను నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం 'నమస్తే తెలంగాణ'తో నారదాసు మాట్లాడారు. పార్టీ ఏర్పాటుకు ముందు నుంచే కేసీఆర్‌తో నడిచారని, అందుకు తనకు తగిన గుర్తింపు దక్కిందని, పార్టీలో పొలిట్‌బ్యూరోలో స్థానం, రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని చెప్పారు. కేసీఆర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని, జిల్లాలో పార్టీని బలోపేతం చేసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ఇంకా మరెన్నో విషయాలు ఆయన మాటల్లోనే.. తెలంగాణ వస్తుందని విశ్వసించిన మొదటి వ్యక్తి కేసీఆరే. ఆయన పార్టీ పెట్టక ముందు నుంచే నేను ఆయనతో కలిసి నడుస్తున్న. ఏప్రిల్ 27న జలదృశ్యంలో టీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ ప్రకటించినపుడు కొందరు వ్యక్తుల్లో ఒకడిగా నేను ఆయన వెంట ఉన్న. పార్టీ స్థాపించిన తర్వాత మొదటి బహిరంగ సభ కరీంనగర్‌లో పెట్టాలని జిల్లాలోని ముఖ్యులతో కేసీఆర్ చర్చించారు. 2001 మే 17న కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సింహగర్జన సభకు మేం 70వేల నుంచి లక్ష మంది జనం వస్తారని అనుకున్నం. కానీ, ఊహించని రీతిలో లక్షలాది మంది తరలివచ్చారు. ఆ తర్వాత కూడా కేసీఆర్ ఏ పిలుపునిచ్చినా ఇక్కడి ప్రజలు వెన్నంటే నిలిచారు. అదే మమకారంతో కేసీఆర్ కరీంనగర్ గడ్డ నుంచే అనేక కార్యక్రమాలు చేపట్టారు. అనేక వ్యూహాలు రచించారు. 2009 నవంబర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్న విషయాన్ని ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేశాం. అరెస్ట్‌కు ముందు అంటే 2009 నవంబర్ 26న కేసీఆర్ కరీంనగర్ వచ్చారు. 27, 28 తేదీల్లో రాష్ట్రంలోని సబ్బండ వర్గాలతో కరీంనగర్‌లోనే చర్చలు జరిపారు. 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్దిపేటకు తరలివెళ్తుండగా అల్గునూర్‌లో అరెస్ట్ చేశారు. తర్వాత తెలంగాణ ఏర్పడింది. పార్టీ స్థాపించిన 24 ఏండ్లలో ఎన్నో ఎదురు దెబ్బలు, అవమానాలను ఎదుర్కొన్నం. రెండు పర్యాయాలు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దేశంలోనే అత్యున్నత స్థానంలో నిలిపారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా పార్టీ మరింత బలోపేతమైంది. ఈ నేపథ్యంలో ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న పార్టీ రజతోత్సవ సభ రాష్ట్ర రాజకీయాలను కీలక మలుపు తిప్పనున్నది. ప్రతి కార్యకర్తలో ఇప్పుడు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి రగులుతున్నది. ప్రజలు కూడా మా పార్టీవైపే కనిపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ ఆ పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. అందుకే లక్షలాది మందిని తరలించి సభను విజయవంతం చేయాలని ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త అంకిత భావంతో పనిచేస్తున్నారు.



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్సీ నారదాసు (ఫైల్)






## రజతోత్సవ సభకు రారండోయ్..



సభకు రావాలని గంగాధర మండలంలో బూరుగుపల్లిలో డప్పుకొట్టి దండోరా వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చా రు. శనివారం గంగాధర మండలం బూరుగుపల్లిలో డప్పు కళాకారులతో కలిసి డప్పు కొడుతూ సభకు రావాలని దండోరా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభ మహాకుంభమేళాను తలపించాలని ఆకాంక్షించారు. చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 10వేల మందిని సభకు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నేటి ఉదయం గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేసి సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమయన్వయంతో పనిచేసి లక్ష్యం మేరకు జనాన్ని తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

## కడుపు మండి.. ధాన్యం తగలబెట్టి

- కొనుగోలు చేయకపోవడంతో రోడ్డెక్కిన రైతన్న



అజ్మీరా తండాలో రోడ్డుపై బైఠాయించి, ధాన్యాన్ని మంటల్లో పోస్తూ ధర్నా చేస్తున్న రైతులు

కోనరావుపేట, ఏప్రిల్ 26 : కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యాన్ని కొనకపోవడం.. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకుండా జాప్యం చేస్తుండడంతో రైతన్న కడుపు మండింది. చేసేదేమీ లేక రోడ్డెక్కి ధాన్యాన్ని తగులబెట్టి నిరసనకు దిగారు. ఐకేపీ కేంద్రంలో పోసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించాలని కోనరావుపేట మండలంలోని అజ్మీరా తండాలో రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నలభై ఐదు రోజుల క్రితం వరి కోతలు కోసి కేంద్రంలో ధాన్యం పోస్తే కొనుగోళ్లు సవ్యంగా జరపడం లేదని మండిపడ్డారు. సెంటర్‌కు మూడు లారీలు వచ్చి లోడ్ చేసుకొని వెళ్తే ఇప్పటివరకు మరొకటి ఇటువైపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు సిరిసిల్ల–మరిమడ్ల రహదారిపై రైతులు, మహిళలు బైఠాయించి రెండు గంటల పాటు ధర్నా చేశారు.

## చరిత్రలో నిలిచేలా సభ

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి, ఏప్రిల్ 26 : ఈ నెల 27న ఎల్కతుర్తిలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నిర్వహించే రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో రజతోత్సవ బహిరంగ సభ జరుగుతుందని, లక్షలాది మంది తరలి వచ్చే ఈ సభ ప్రపంచ చరిత్రలోనే ఒక గొప్ప సభ కానుందని వివరించారు. రజతోత్సవ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి సుమారు లక్ష మంది వరకు హాజరు కానున్నారని తెలిపారు. ఒక్క ధర్మపురి నియోజకవర్గం నుంచే 10 వేల మంది వరకు హాజరవుతారని ఈశ్వర్ వివరించారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారని, బహిరంగ సభకు వచ్చే వారంతా జాగ్రత్తగా వచ్చి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, నర్సింహారెడ్డి, లక్ష్మణ్, కరుణాకర్ రావు, స్వామి, గంగాధర్, తిరుపతి, పెద్ది రమేశ్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సుధాకర్, వీరేశం, శంకర్, శాంతపురావు, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలకేంద్రంలో 'జై తెలంగాణ' నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు


